ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 5 జూలై 2025



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

గ్రామస్థాయికి జన్ సురక్ష పథకాలు

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎల్డీఎం, ఇతర బ్యాంకు, జిల్లా అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జన్ సురక్ష పథకాలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా ఈ నెల నుంచి సెప్టెంబరు 30 వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జన్ సురక్ష పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఇందుకు తగు కార్యాచరణ సిద్ధం చేయాలని ఎల్డీఎంను ఆదేశించారు. జిల్లాలో బ్యాంకు ఖాతాలు లేని కుటుంబాలను గుర్తించి, వారిచేత ఖాతాలు తెరిపించాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసే దిశలో మెప్మా, డీఆర్డీఏ, డ్వామా శాఖలను సమన్వయం చేసుకుని వెళ్లాలన్నారు. ప్రతిగ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి బ్యాంకు సమస్యలు, ఖాతాలను పరిష్కరించాలని ఆదేశించారు. సైబర్ మోసాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. ప్రతి బుధవారం జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎల్డీఎం జనార్ధనం, ఉద్యాన శాఖాధికారులు చంద్రనాయక్, రవిచంద్ర, యూనియన్ బ్యాంకు ఆర్ఎం లక్ష్మీతులసి, నాబార్డు డీడీఎం విజయ విహారి, ఎస్బీఐ ఆర్ఎం కృష్ణకిశోర్, వివిధ బ్యాంకు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం అయితే చర్యలు

● హెచ్చరించిన కలెక్టర్

కడప కలెక్టరేట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి కొరత రాకూడదని, తాగునీరు కలుషితం అయిందని ఏ ఒక్క ఫిర్యాదు అందినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జల్‌జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో అమలవుతున్న శుద్ధ తాగునీటి సరఫరా, పారిశుధ్య పనుల పురోగతిపై జేసీ అదితిసింగ్‌తో కలసి ఆర్‌డబ్ల్యూఎస్, పారిశుధ్య శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా శుద్ధ తాగునీటి సరఫరా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అన్ని పంచాయతీల్లో క్రమం తప్పకుండా తాగునీటి నాణ్యతా పరీక్షలు నిర్వహించాలన్నారు. క్లోరినేషన్ సిస్టమ్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. తాగునీరు సరఫరా, డ్రైజేజీ సిస్టమ్ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఏడుకొండలు, పంచాయతీరాజ్, డీఆర్డీఏ, మెప్మా, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

● జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ యామిని తెలిపారు. జిల్లాలోని ఆయా కోర్టులలో కేసుల పరిష్కారానికి 24 బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కోర్టులో 6, ప్రొద్దుటూరు కోర్టులో 3, రాజంపేట కోర్టులో 3, రాయచోటి కోర్టులో 3, బద్వేల్ కోర్టులో 3, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం కోర్టులలో ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. కక్షిదారులు, జాతీయ లోక్‌అదాలత్‌లో తమ కేసులను రాజీచేసుకుని సత్వర న్యాయం పొందవచ్చన్నారు.

నేడు ఎంపీడీవోలకు శిక్షణ

కడప రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎంపీడీవోలకు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్‌సీ)లో శనివారం శిక్షణ నిర్వహిస్తున్నట్లు డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్, జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ తెలిపారు. పంచాయతి రాజ్ అడ్వాన్స్ ఇండెక్స్ అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోని ఎంపీడీవోలతో పాటు డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు తప్పక హాజరుకావాలన్నారు.

కడప డిప్యూటీ చీఫ్ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్‌పై విచారణ

కలికిరి/కడప, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కడప ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణమూర్తిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కృష్ణమూర్తి కడపలో పనిచేస్తున్న సమయంలో ఈయన వ్యవహార శైలిపై కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్క్ ఏరియా లోకల్ అథారిటీ (ఐఏఎల్ఏ) అధ్యక్షుడు పలు ఆరోపణలతో ప్రభుత్వానికి ఈ ఏడాది జనవరి 31న ఫిర్యాదు చేశారు. వారం రోజుల తరువాత కడప జిల్లా కలెక్టర్ కూడా దీనిపై నివేదిక పంపారు. అనంతరం ఆయనపై అభియోగాలు నమోదు చేసి ఏలూరుకు బదిలీ చేశారు. దీనిపైన తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కూడా ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో కృష్ణమూర్తిపై విచారణ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయంలోని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎస్.ఉషారాణిని విచారణాధికారిగా నియమించారు. ఆమెకు విచారణలో ఆధారాలు సేకరించడానికి అనువుగా నెల్లూరు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.ఈశ్వరచంద్‌ను ప్రైజెంటింగ్ అధికారిగా నియమించారు. రెండు నెలల్లోగా విచారణ పూర్తిచేసి నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశిస్తూ కార్మిక శాఖ కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

పోలీసుల అదుపులో నకిలీ పట్టాల ముఠా?

బద్వేలు టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో పురోగతి సాధించకపోయినా, భూకబ్జాలు, నకిలీ పట్టాల తయారీలో మాత్రం బద్వేలు పట్టణం రాష్ట్రంలోనే సంచలనంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ నకిలీ పట్టాల వ్యవహారం ఎన్నడూ లేనంత ఎక్కువగా సాగింది. దీంతో 2022 మే నెలలో 17 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'నకిలీ పట్టాల కేసు కంచికేనా' అనే శీర్షికతో కథనం రావడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో మరోసారి బద్వేలులో నకిలీపట్టాల వ్యవహారం తెరపైకి వచ్చింది. తాజాగా పట్టణంలోని మార్తోమనగర్ సమీపంలోని స్థలాన్ని ఓ మహిళ ముగ్గురికి విక్రయించింది. దీంతో ఈ స్థలం మాదంటే మాదని ముగ్గురు వ్యక్తులు వాగ్వాదానికి దిగారు. చివరకు ఆ మహిళ నకిలీ పట్టాలతో ముగ్గురికి విక్రయించారన్న విషయం తెలుసుకున్న బాధితులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ నకిలీ పట్టాలపై దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా పలువురు అనుమానితులను పోలీసులు అతిగోప్యంగా డీఎస్పీ పర్యవేక్షణలో విచారిస్తున్నట్లు సమాచారం. ఈ దర్యాప్తులో కొన్ని పత్రాలతో పాటు రెవెన్యూ అధికారుల సీళ్లను స్వాధీనం చేసుకున్నారని.. ఓ రెవెన్యూ అధికారి కూడా పోలీసుల అదుపులో ఉన్నాడని సమాచారం.

రైళ్లల్లో తనిఖీలు



కడప రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టిన మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి

7

ఒక అరెస్టు.. ఎన్నో భయాలు..
మరెన్నో సందేహాలు

రాయచోటిలో జరిగిన అల్ ఉమా ఉగ్రవాదుల అరెస్టు.. ప్రజల్లో ఎన్నో భయాలను.. మరెన్నో సందేహాలను మిగిల్చింది. "30 సంవత్సరాలుగా ఉగ్రవాదులు రాయచోటిలో నివాసం ఉన్నా.. వారు ఎవరైందీ తెలియక.. వాళ్లతో సన్నిహితంగా తిరిగాము.. ఫోన్లలో మాటామంతీ నడిచింది.. తీరా చూస్తే.. వాళ్లు అరెస్టు అయ్యారు.. ఇప్పుడు మా పరిస్థితి ఏంటి" అనే భయం పట్టణంలోని పలువురిలో కనిపిస్తోంది. అదే సమయంలో మూడు దశాబ్దాలుగా ఇక్కడ ఉన్న ఉగ్రవాదులు.. ఈ ప్రాంతంలో ఎంతమందికి తమ భావజాలం ఎక్కించి ఉగ్రవాదులుగా... సానుభూతి పరులుగా మార్చుకున్నారో? అనే భయం.. సామాన్య జనంలో కనిపిస్తోంది.

మరోవైపు.. పోలీసులు ఉగ్రవాదులను అరెస్టు చేయడంతో పాటు.. బాంబులు, బాంబు తయారీ పదార్థాలను స్వాధీనం చేసుకోకుంటే.. ఏం జరిగేదో? ఊహించుకోవడానికే భయంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో.. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఏ ఊర్లో చూసినా.. ఉగ్రవాదుల గురించే చర్చ నడుస్తోంది. సందెట్లో సడేమియా అన్నట్లు.. అదిగో పులి అంటే.. ఇదిగో తోక అని పుకార్లు కూడా జోరుగా షికారు చేస్తున్నాయి. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించేందుకు రంగంలోకి కేంద్ర దర్యాప్తు బృందాలు దిగినట్లు తెలుస్తోంది.



ఉగ్రవాదుల ఇంట్లో నుంచి స్వాధీనం చేసుకున్న బాంబును నిర్వీర్యం చేసేందుకు ఊరవతల పొలం వద్ద పోలీసుల ప్రయత్నం

● భగ్నమే చేయకుంటే.. ఏం జరిగేదో?

● ఊరంతా ఉగ్రవాదుల చర్చే

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పోలీసులు సోమవారం అర్ధరాత్రి అబూబక్కర్ సిద్దిఖీ అలియాస్ అమానుల్లా, మహమ్మద్ అలీ అలియాస్ మన్సూర్‌లను అరెస్టు చేశారు. వీళ్ల ఇద్దరూ 1995 నుంచి తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో పలుచోట్ల బాంబుపేలుళ్లకు పాల్పడ్డట్లు కేసులు ఉన్నాయి. అందులో ప్రముఖంగా బీజేపీ సీనియర్ నాయకులు ఎల్‌కే అద్వానీని హత్య చేయడానికి ప్రయత్నించారన్న కేసు ఉంది. ఇంకా పలు కేసుల్లో అరెస్టు అయి.. బెయిల్ మీద బయటకు వచ్చి.. కోర్టుకు హాజరుకాకుండా పారిపోయి రాయచోటిలో స్థిరపడ్డారు. 30 సంవత్సరాలుగా ఇక్కడే ఉంటూ.. 2011లో బెంగళూరులోని మంగళూరులో బాంబుపేలుళ్లకు పాల్పడిన కేసులో అబూబక్కర్ ప్రథమ ముద్దాయిగా, మహమ్మద్ సైతం ఈ సంఘటనలో పాలుపంచుకున్నట్లు కేసులు ఉన్నాయి. అయినప్పటికీ వీళ్లు తమ ఆచూకి తెలియకుండా.. రాయచోటిలోనే మకాం పెట్టి.. ఇక్కడే పెళ్లిళ్లు చేసుకుని.. పిల్లలను కూడా కన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ఇంటలిజెన్స్ బ్యూరో పోలీసులు నాన్‌బెయిలబుల్ వారెంటు కోసం వీళ్లను వెతకడం ప్రారంభించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో.. మారువేషాలలో తిరిగిన ఆ పోలీసులు ఉగ్రవాదుల జాడ కనిపెట్టి.. జిల్లా పోలీసుల సాయంతో అరెస్టు చేసి తమతో తీసుకెళ్లిపోయారు. తర్వాత.. ఉగ్రవాదుల భార్యలను సైతం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. తర్వాత విషయాలే స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

అందరిలో ఆందోళన

అబూబక్కర్ సిద్దిఖీ పట్టణంలోని కొత్తపల్లె ప్రాంతంలో చిల్లర దుకాణాన్ని నిర్వహిస్తూ ఉన్నాడు. మహబూబ్‌నగర్ వీధిలో నివాసం ఉన్న మహమ్మద్ అలీ చిల్లర దుకాణంతో పాటు.. చీరల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. వీళ్ల దుకాణాలకు రోజూ వచ్చి పోయిన స్థానికులు ఇప్పుడు వణికిపోతున్నారు. ఇప్పటికే ఆ ఉగ్రవాదులతో సన్నిహితంగా మెలిగిన పలువురిపై పోలీసులు నిఘా ఉంచారు. కొందరిని తమ అదుపులోకి తీసుకుని తమ శైలిలో విచారిస్తున్నారు. చిల్లర, చీరల దుకాణం ఉండడంతో.. పెద్దసంఖ్యలో జనాల ఫోన్ నంబర్లు ఉగ్రవాదుల దగ్గర ఉన్నాయి. వీళ్ల నంబర్లకు పదేపదే ఫోన్లు కూడా వెళ్లాయి. ఈ నంబర్లను చూసి.. పోలీసులు

- తరువాయి 6లో..



రాయచోటిలోని ఉగ్రవాదుల ఇళ్లలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు, ల్యాప్‌టాప్‌లు, బాంబు తయారీ పదార్థాలు



ఇసుక బస్తాల మధ్య ఉంచి బాంబులను డిస్పోజ్ చేస్తున్న దృశ్యం



నిర్వీర్యం చేసిన సూట్‌కేస్ బాంబు

ఆదర్శనీయుడు అల్లూరి సీతారామరాజు



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఇన్‌చార్జి డీఆర్వో వెంకటపతి

కడప కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు యువతకు ఆదర్శనీయుడని ఇన్‌చార్జి డీఆర్వో వెంకటపతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధికారులతో కలసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను మరువరాదని, అల్లూరి ధైర్య సాహసాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. కేవలం 27 ఏళ్ల వయసులోనే బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహాశక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, బీసీ సంక్షేమ శాఖ డీడీ అంజన, సమాచార శాఖ ఏడీ పద్మజ, కలెక్టరేట్ ఏవో విజయకుమార్, టూరిజం మేనేజరు రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయంలో లింగాల టాప్

● ఇక్కడి ప్రజల తలసరి ఆదాయం రూ.7.38లక్షలు

● రూ.4.95లక్షలతో వేముల రెండో స్థానం

● రూ.4,80,167తో సింహాద్రిపురం మూడో స్థానం

● రూ.1,34,404తో గోపవరం చివరి స్థానం



పులివెందుల, జూలై 4(ఆంధ్రజ్యోతి): లింగాల మండలంలో ప్రజల తలసరి ఆదాయం రూ.7.38 లక్షలతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఇక వేముల రెండవ స్థానంలో, సింహాద్రిపురం మూడవస్థానంలో నిలిచాయి. గోపవరం చివరి స్థానంలో నిలిచింది. లింగాల మండలంలో ప్రజల తలసరి ఆదాయం 2023-24 సంవత్సరానికి రూ.7.38 లక్షలుగా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఆదాయం ఈ స్థాయిలో నిలవడానికి ప్రధానంగా ఉద్యాన పంటల సాగే కారణంగా తెలుస్తోంది. ఇక్కడ అరటి సాగు ఎక్కువ. పది టన్నులు పండించే రైతు నుంచి దాదాపు మూడు నాలుగు వందల టన్నులు పండించే రైతులు ఉన్నారు. అరటి తర్వాత చీనీ, టమోట, తదితర పంటలు కూడా విరివిగా సాగులో ఉన్నాయి. అందులోను ఈ ఏడాది అరటి ధరలు రైతుకు ఆశాజనకంగా ఉన్నాయి. 2023-24 ఏడాదికే కాకుండా లింగాల మండలం తలసరి ఆదాయం 2014 నుంచి ఒకటి రెండుసార్లు రాష్ట్రంలో మొదటి, రెండవస్థానంలో నిలిచినట్లు అధికారులు చెబుతున్నారు. వేముల మండలం రూ.4.95 లక్షల తలసరి ఆదాయంతో రెండో స్థానంలో, సింహాద్రిపురం మండలం రూ.4,80,164 తలసరి ఆదాయంతో మూడో స్థానంలో నిలిచాయి. ఇక గోపవరం మండలం కేవలం రూ.1,34,404 తలసరి ఆదాయంతో జిల్లాలో చివరి స్థానంలో నిలిచింది.


కృష్ణాజలాల రాకతో..

పులివెందుల అంటేనే కరువుప్రాంతం అని అందరి భావన. ఒకప్పుడు లింగాల మండలంలో అనేక గ్రామాలు ఫ్యాక్షన్‌తో నలిగిపోతూ వచ్చాయి. రానురాను ఫ్యాక్షన్ విడిచి అభివృద్ధివైపు పయనిస్తున్నాయి. ముఖ్యంగా పులివెందుల ప్రాంత రైతులకు కృష్ణాజలాలు ఒక పెద్దవరంలా మారాయి. ఈ నియోజక వర్గంలో ఉద్యానపంటల సాగు ఎప్పటి నుంచో ఉంది. కానీ వేసవిలో భూగర్భజలాలు అడుగంటి పంట దిగుబడి చేతికొచ్చే సమయంలో బోరుబావుల్లో నీరులేక రైతులు అప్పులపాలయ్యేవారు. 2017లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం పులివెందులకు మొదటిసారి కృష్ణాజలాలను మళ్లించింది. అప్పటి నుంచి ఉద్యాన పంటల సాగు పెరుగుతూ వస్తోంది. గత మూడు నాలుగు సంవత్స రాలుగా అటు పైడిపాళెం, ఇటు సీబీఆర్‌లు నిండుకుండల్లా నీటితో కళకళలాడుతున్నాయి. దీనితో భూగర్భజలాలు పెరిగి సాగు చేసిన పంటలు అనుకున్నస్థాయిలో చేతికం దడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోనే లింగాల తలసరి ఆదాయంలో మొదటిస్థానంలో నిలవడానికి ఉద్యాన పంటలు, వ్యవసాయ అనుబంధ రంగాలే ప్రధాన కారణం. ఏదిఏమైనా ఒకప్పటి కరువు ప్రాంతంలో కృష్ణాజలాల పుణ్యమా అని ప్రజల తలసరి ఆదాయంలో రాష్ట్రంలో మొదటి స్థానంలో లింగాల నిలవడం హర్షించదగ్గ విషయం.



లింగాల మండలంలో సాగులో ఉన్న అరటి తోటలు

విచ్చలవిడిగా..




శిలాఫలకం వెనుక వైపు గ్రావెల్‌తో వెళుతున్న టిప్పర్

● స్టీల్‌ప్లాంట్ శిలాఫలకాల వెనుకే మట్టి తవ్వకాలు

● డివిజన్‌స్థాయి అధికారులున్నా లేనట్లే

జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లో మట్టి రాక్షసులు, ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. జమ్మలమడుగు మండలం కొండ ప్రాంతంలో మట్టి, పెన్నానదిలో ఇసుక అక్రమ రవాణా అడ్డుఅదుపు లేకుండా సాగుతోంది. ఎంతలా అంటే స్టీల్‌ప్లాంట్ శిలాఫలకం వెనుక వైపే మట్టి తవ్వి తరలించేంతగా..

జమ్మలమడుగు, జూలై 4(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో 2019 డిసెంబరులో స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం కన్యతీర్థం సున్నపురాళ్లపల్లె గ్రామాల మధ్య శిలాఫలకాన్ని వేశారు. దీనికి సమీపంలోనే 2023లో మరో శిలాఫలకాన్ని వేసి భూమి పూజ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అక్కడ ఎలాంటి నిర్మాణాలు జరగలేదు. కడప మహానాడు వేదికగా స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం త్వరలో జిందాల్ కంపెనీవారితోనే పనులు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఆ దిశగా నాలుగు రోజుల క్రితం జిందాల్ ప్రతినిధులు స్థానిక అధికారులతో కలసి భూములను పరిశీలించారు. అయితే శిలాఫలకాల వెనుక భాగంలో కొన్ని నెలలుగా ఎర్రమట్టి గ్రావెల్ ఎక్స్‌కవేటర్ల ద్వారా నింపుకుని బయటి ప్రాంతాలకు తరలించడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికే కన్యతీర్థం శైవక్షేత్రానికి సమీపాన, స్టీల్‌ప్లాంట్ శిలాఫలకాల వెనుక భాగంలో, హెలిప్యాడ్ పక్కన హిటాచీతో టిప్పర్లకు ఎర్రమట్టి గ్రావెల్ నింపుకుని తరలిస్తున్నారు. రాత్రి సమయంలో టిప్పర్లు ఎక్కువగా తిరుగుతుంటాయని ఆ ప్రాంతవాసులు తెలిపారు. ఇక్కడికి 15 కి.మీ దూరంలోనే డివిజన్‌స్థాయి రెవెన్యూ అధికారులు ఉన్నప్పటికి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



స్టీల్‌ప్లాంట్ శిలాఫలకాల వెనుకభాగంలో హిటాచీతో టిప్పర్‌కు మట్టి నింపుతున్న దృశ్యం

విద్యార్థినులను పరామర్శించిన డీఎంహెచ్‌వో



విద్యార్థులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య

చిన్నమండెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బోనమల ప్రభుత్వ పాఠశాలలో ఒక తాగుబోతు విద్యార్థులపై చేసిన దాడిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఆరాతీశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బోనమల ప్రాథమిక పాఠశాలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య సంఘటన స్థలానికి వెళ్లి బాలికలను, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం బలికలపై దాడి జరిగిన వెంటనే చిన్నమండెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు వెళ్లి చికిత్స చేశారన్నారు. మెరుగైన వైద్యం అందించారన్నారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి బాలికలను పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు. విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు పాఠశాలలోకి వెళ్లి విద్యార్థులపై దాడి చేస్తుంటే ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

థైలేరియా ప్రాణాంతక వ్యాధి

● రాయచోటి డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మాలకొండయ్య

సుండుపల్లె, జూలై4(ఆంధ్రజ్యోతి): థైలేరియా ప్రాణాంతక వ్యాధి అని రాయచోటి డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మాలకొండయ్య తెలిపారు. శుక్రవారం సుండుపల్లె మండలంలోని ఈడిగపల్లెలో సంకరజాతి పాడి పశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం ఉచితంగా విడుదల చేసిన ఖరీదైన యాంటీ ప్రొటోజోల్ టీకాను 25 పాడి పశువులకు వేశామన్నారు. పాల ఉత్పత్తి కోసం రైతులు వేలాది రూపాయలు వెచ్చించి సంకరజాతి పాలిచ్చే పశువులను కొనుగోలు చేసి ఉంటారని, పిడుదుల ద్వారా వ్యాపించే థైలేరియా ప్రాణాంతక వ్యాధి నుంచి కాపాడేందుకు ఈ టీకాను తప్పనిసరిగా వేయించాలన్నారు. జ్వరం, రక్తహీనత, వ్యాధినిరోధక శక్తి తగ్గడం, పాల దిగుబడి తగ్గడం, పశువులు నీరసించిపోవడం, బూడిదరంగు మూత్రంతో పాటు మరికొన్ని లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు కల్పిస్తే వెంటనే పశుసంవర్థక శాఖ వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు డాక్టర్ విజయ్‌కుమార్, సహాయ సంచాలకులు డాక్టర్ రవి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పాడి పశువులకు యాంటీ ప్రోటోజోల్ టీకాలు వేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాలకొండయ్య

ఒక అరెస్టు.. ఎన్నో భయాలు..

మరెన్నో సందేహాలు

● భగ్నమే చేయకుంటే.. ఏం జరిగేదో?

● ఊరంతా ఉగ్రవాదుల చర్చే



ఇసుక బస్తాల మధ్య ఉంచిన బాంబులను డిస్పోజ్ చేస్తున్న దృశ్యం

(మొదటిపేజీ తరువాయి)

తమనెక్కడ విచారణకు పిలుస్తారో? అని చాలా మంది హడలిపోతున్నారు. అదే సమయంలో చాలా మందికి ఉగ్రవాదులతో ఆర్థిక లావాదేవీలు నడిచాయి.. ఇప్పుడు వీళ్లంతా ఆందోళన చెందుతున్నారు.

అందరి మెదళ్లను తొలుస్తున్న ప్రశ్నలు..

చుట్టుపక్కల వాళ్లకు వీళ్ల ఎవరైందీ తెలియకుండా.. ఇన్ని సంవత్సరాలు ఎలా రహస్యంగా ఉంచగలిగారు? నిజంగానే.. స్థానికులు ఎవరికీ వీళ్ల ఎవరైందీ తెలియదా? కొంతమందికైనా తెలుసా.? ఎవరైనా అమాయకులు వీళ్ల ఉచ్చులో చిక్కుకున్నారా? ఇటీవల పట్టణంలో జరిగిన కొన్ని సంఘటనల వెనుక.. ఈ ఉగ్రవాదుల ప్రమేయం ఉందా? వీళ్లతో సన్నిహిత సంబంధాలు కొనసాగించిన.. వ్యక్తుల ప్రమేయం ఉందా? అనే అనుమానాలు ఇప్పుడు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి.

భగ్నమే చేయకుంటే..

ఎంత విధ్వంసమో ?

ఉగ్రవాదుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన పోలీసులు.. అబూబక్కర్ సిద్దిఖీ ఇంట్లో పెద్ద ఎత్తున బాంబులు తయారీ పదార్థాలు, కొంత ఉగ్రవాద సాహిత్యం.. మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు.. 2011లో బెంగళూరులోని మంగళూరులో జరిగిన బాంబు పేలుడు వంటి సంఘటనలు సుమారు 50 వరకు చేయగ లిగే.. బాంబుల తయారీ పదార్థాలను ఇక్కడ స్వాధీనం చేసుకున్నారు. ఒక సూటు కేసు బాంబు, మరో బకెట్ బాంబును తయారు చేసినట్లు సమాచారం. ఈ బాంబు ఒక్కొక్కటి సుమారు 150 మీటర్ల విస్తీర్ణంలో విధ్వంసం సృష్టిస్తుందని పోలీసులు పేర్కొన్నారు. వీటిని దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలలో పేల్చేందుకు ఉగ్రవాదులు ప్రణాళిక సిద్ధం చేశారని... అందుకే ఉగ్రవాదులు బాంబులు తయారు చేసి సిద్ధంగా ఉంచారని పోలీసులు పేర్కొంటున్నారు. ఇటీవలే కశ్మీర్‌లోని పహల్గాంలో పాకిస్థాన్ ఉగ్రవాదుల మారణకాండ మర్చిపోక ముందే.. ఈ ఉగ్రదాడి జరిగిఉంటే.. దేశవ్యాప్తంగా కలకలం రేగేది. అయితే అన్నమయ్య జిల్లా పోలీసులు మూడు దశాబ్దాలుగా తప్పించుకు తిరుగుతున్న ఉగ్రవాదులను ప్రాణాలతో పట్టుకోవడంతో పాటు.. దేశ వ్యాప్తంగా పలుచోట్ల ఉగ్రవాదులు విధ్వంసానికి పాల్పడకుండా భగ్నం చేయగలిగారు. దీనిపై జిల్లా పోలీసులను ప్రజలు ప్రశంసిస్తున్నారు. రాబోయే రోజుల్లో పోలీసుల విచారణలో ఉగ్రవాదుల అరెస్టు.. బాంబులు, బాంబుల తయారీ పదార్థాల స్వాధీనం కేసులో.. ఎన్ని పరిణామాలు జరుగుతాయో ? ఎవరెవరి ప్రమేయం ఉందో ? పోలీసుల విచారణలో వెలుగు చూడాల్సిందే.

భక్తి శ్రద్ధలతో బోనాల పండుగ



బోనం కూడు వండుతున్న మహిళలు

సంబేపల్లె, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటకట్ల శివసాయి ఆలయంలో శుక్రవారం బోనాల పండుగ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మేళతాళాల నడుమ అమ్మవారి నామస్మరణలతో కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి భక్తి పూర్వకంగా మొట్టమొదటి బోనాల పండుగ జరుపుకొన్నారు. వెంకటశివసాయి దేవస్థానం ప్రాంగణం భక్త జన సందోహంతో కళకళలాడింది. ఆలయంలో తొలిసారి బోనాల పండుగ ఎంతో ఘనంగా మహిళలు జరుపుకొన్నారు. రాజరాజేశ్వరి అమ్మవారికి అభిషేకం నిర్వహించగా, అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సంప్రదాయ బోనం సమర్పించి అమ్మవారి ఆశీస్సుల కోసం పూజలు చేశారు. పాలపొంగళ్లు అమ్మవారికి బోనాలను సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గృహోపకరణాలు దగ్ధం

● విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణం

పెద్దతిప్పసముద్రం జూలై 4 (ఆంధ్ర జ్యోతి): ఓ ఇంట్లో ఎవరూ లేని సమ యంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కార ణంగా గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. మల్లెల గ్రామంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ సొంత పనుల నిమిత్తం మరో ఊరికి వెళ్లాడు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవడంతో ఇంట్లోని గృహోపకర ణాలు పూర్తిగా కాలిపోయాయి. ఇంటి నుంచి దట్టమైన పొగ వస్తుండడంతో గమనించిన స్థానికులు అప్రమత్త మయ్యారు. వెంటనే విద్యుత్ సరఫరా కట్ చేసి మంటలను ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయన్నారు. సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అజ్మత్ పేర్కొన్నారు.

కుమారుడి చేతిలో గాయపడిన తండ్రి



రక్తగాయాలతో వెంకటరమణ

మదనపల్లె అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): భార్యపై కోపంతో కొడవలితో దాడి చేయంబోతుండగా అడ్డొచ్చిన తండ్రికి ఆ వేటు పడి గాయపడిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసుల వివరాల మేరకు.. ఇందిరా నగర్‌లో కాపురం ఉంటున్న భాస్కర్‌నాయుడు భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని రెండేళ్లుగా బసినికొండలోని అమ్మగారి ఇంటి వద్ద ఉండేది. కాగా భర్త కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి గురువారం తన ఇంటికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య శుక్రవారం ఉదయం భర్తను చూసేందుకు రావడంతో భర్త ఆగ్రహంతో ఊగిపోయాడు. రెండేళ్లుగా అవసరం లేని తాను ఇప్పుడు కావాల్సి వచ్చాడా అంటూ ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో కోపంతో కొడవలితో దాడి చేయబోయాడు. ఈ నేపథ్యంలో అడ్డొచ్చిన భాస్కర్‌నాయుడు తండ్రి వెంకటరమణ (60) తలపై కొడవలి వేటు పడడంతో తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాయపడిన వ్యక్తిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విచారించి టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): సమస్యలతో విసుగు చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బి.కొత్తకోట మండలం, బడికాయలపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు మల్లప్ప(45) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. అయితే కొన్ని సమస్యలతో పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయిన ఆయనను కుటుంబ సభ్యులు గమనించి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోళ్లబైలులో ఆలయ స్థలం పరిశీలన



ఆలయ స్థలం పరిశీలిస్తున్న ఎండోమెంట్ జిల్లా అధికారి విశ్వనాథ్

మదనపల్లె అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి) మండలంలోని కోళ్లబైలు పంచాయతీలో, ఇందిరమ్మ కాలనీలో గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని, ఆలయ స్థలాన్ని శుక్రవారం దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ పరిశీలించారు. కలెక్టరేట్ ఆదేశాల మేరకు కాలనీలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఆంజనేయస్వామి ఆలయ స్థలం పరిశీలించి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థలం సర్వే నిర్వహించి ఆలయం ఏర్పాటుకు సహకరించాలని దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్‌ను గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో ఈవో రమణ, కాలనీ వాసులు శ్రీనివాసులరెడ్డి, రవీంద్రరెడ్డి, మధుసూదన, రామ్మోహన, ఏవీ లక్ష్మీనారాయణ, మంజునాథ, శ్రీరాములు, విజయ్‌కుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.


చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

» మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా

» అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్

» మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి

» డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

» ఏటీఎం కార్డుల్లా రూపకల్పన

» క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం

» పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు

» నేతల ఫొటోలు లేకుండా ముద్రణ

» ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు

» సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు

» వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

పసుపు సాగుపై ఆసక్తి

- రెట్టింపు సాగవుతుందని అంచనా
- గిట్టుబాటు ధరలే కారణమంటున్న రైతులు

దువ్వూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రైతులు కుదేలవుతున్నారు. ధరల పతనం, తెగుళ్లు వెంటాడుతుండడం, పెట్టుబడులు తడిసి మోపెడు అవుతున్న నేపథ్యంలో పంటలసాగుపై



నిలువ ఉంచిన విత్తనాన్ని సాగుకు తరలిస్తున్న రైతులు

అన్నదాతకు ఆసక్తి సన్నగిల్లుతోంది. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు అందే పంటలపై మొగ్గుచూపుతున్నారు. తదనుగుణంగా ఆరుతడి పంటల సాగుపై మక్కువ కనపరుస్తున్నారు. గడిచిన మూడేళ్లుగా పసుపు పంట సాగు చేసిన రైతులు మంచి ఫలితాలు సాధించారు. ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ పంట సాగుకు ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మైదుకూరు ప్రాంతం పసుపుసాగుకు పెట్టింది పేరు. ఈ ప్రాంతంలోని దువ్వూరు, చాపాడు, ఖాజీపేట, మైదుకూరు పరిసరాల్లో కేసీ ఆయకట్టు పొలాల్లో ప్రతి ఏటా ఈ పంట సాగు చేపడుతారు. ప్రతియేటలాగే ఈసారి కూడా ఈ పంట సాగును ముమ్మరం చేశారు. పొలాల్లో విత్తనం వేయడానికి ఇదే అదును కావడంతో ఆ పనుల్లో రైతులు మునిగిపోయారు. కిందటి ఏడాది దువ్వూరులో 502 ఎకరాల్లో, ఖాజీపేట 413, మైదుకూరులో 798, చాపాడులో 315, రాజుపాళెంలో 50 ఎకరాలు రైతులు పసుపు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు తెలుపుతున్నాయి. మొత్తంగా రెండు వేల ఎకరాలకుపైగా ఈ పంట పెట్టిన రైతాంగం ధరలు ఆశాజనకంగా ఉండడంతో మంచి లాభాలు గడించారు.

రెట్టింపు సాగవుతుందని అంచనా..

మార్కెట్‌లో క్వింటాలు వట్టి పసుపు 10 వేల నుంచి 12,500 ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో నిరుడుతో పోల్చుకుంటే మైదుకూరు డివిజన్‌లో కొంచెం అటు ఇటుగా రెట్టింపు సాగవుతుందని అంచనా వేస్తున్నారు. పొలంలో విత్తనం వేసే పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకున్నాయి. ఎకరాలో నాలుగు పుట్లకుపైగా విత్తనం వేస్తున్నారు. పుట్టి పసుపు ఆరు నుంచి రూ.7 వేలు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడులు తడిసి మోపెడు అవుతున్నా రైతులు సాగుకు వెనుకంజ వేయడంలేదు. మైదుకూరు ప్రాంత విత్తన కొమ్ముకు మంచి డిమాండ్ ఉంది. అక్కడి నుంచి కొనుగోలు చేసి మిగతా మండలాల్లో ఈ పంట వేస్తున్నారు. చాలా మంది రైతులు వారి పొలంలో పండిన పసుపును విత్తనంగా నిలువ ఉంచి ఇప్పుడు పొలంలో విత్తుతున్నారు. విత్తనం వేసే ముందు పొలాలకు అనుకూలమైన చెక్క, రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారు. సాలు, బోదె పద్ధతుల్లో విత్తుతున్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో కేసీ కాలువకు ముందుగానే సాగునీరు అందుతుందని రైతులు భావిస్తున్నారు.



పొలంలో పసుపు విత్తనం వేస్తున్న కూలీలు

బాలలహక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

కడప కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశహాల్‌లో బాలల హక్కుల పరిరక్షణ అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, కమిషన్ విధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పిల్లల పట్ల సున్నితత్వంతో మెలగాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగు పరచాలన్నారు. ప్రతి హాస్టల్‌లో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాల్లో పిల్లలను సొంత బిడ్డల్లాగా వారి బాగోగులు చూడాలని సూచించారు. పిల్లలు తమకు ఎదరయ్యే సమస్యలు, ఇబ్బందులపై ఎవరికీ చెప్పుకోలేరని.. అందుకోసం రాజ్యాంగం ప్రత్యేక హక్కులు కల్పించిందన్నారు. పిల్లల సమస్యల పరిష్కారానికి 1098 టోల్ ఫ్రీ నెంబరుకి ఫోన్ చేస్తే పరి ష్కరిస్తామని కమిషన్ సభ్యురాలు తెలియజేశారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, బీసీ వెల్ఫేర్ డీడీ అంజల, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసరు హిదాయుతుల్లా, ఉమెన్ పోలీసు స్టేషన్ డీఎస్పీ బాలస్వామి, బాలల సంరక్షణ అధికారి సుభాష్, సంక్షేమ హాస్టళ్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో జీవితఖైదు



జీవిత ఖైదు శిక్ష పడిన మల్లికార్జున

కడప క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కడప తాలుకా పీఎస్ పరిధిలో ఆరేళ్లక్రితం అనుమానంతో తన భార్యను వేధింపులకు గురి చేసి గొంతు నులిమి హత్య చేసిన కేసులో నిందితుడు జరిపిటి మల్లికార్జున (41)కు జీవితఖైదు, రూ.1.60 లక్షలు జరిమానా విధిస్తూ కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి జీఎస్ రమేశ్ కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా.. కడప ఏఎస్ ఆర్‌నగర్‌లో నివశించే మల్లికార్జున చిత్తూరు జిల్లాకు చెందిన తమ్మిశెట్టి గంగాదేవితో 2012లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మల్లికార్జున పండ్లను విక్రయిస్తూ కుటుం బాన్ని పోషించేవాడు. భార్య గంగాదేవిపై అనుమానం పెంచుకుని హత్య చేస్తానని బెదిరించేవాడు. ఈ క్రమంలో 2019లో తన భార్యను గొంతు నులిమి హత్య చేశాడు. మృతురాలి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు అప్పటి తాలుకా సీఐ విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కాగా విచారణలో సాక్ష్యాలతో సహా నేరం నిరూపణ కావడంతో మల్లికార్జునకు జీవిత ఖైదు, రూ.1.60 లక్షలు జరిమానా విధిస్తూ కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి తీర్పు ఇచ్చారు. సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచి సాక్ష్యాధారాలతో నేరస్తుడికి శిక్షపడేలా కృషి చేసిన కడప తాలుకా సీఐ రెడ్డప్ప, కోర్టు కానిస్టేబుల్ రఘురాముడు, కోర్టుమానిటరింగ్ సెల్ హెడ్‌కానిస్టేబుల్ రాజులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

యువతి హత్య కేసులో ముగ్గురికి పదేళ్లు జైలు



జైలుశిక్ష పడిన ముద్దాయిలు వీరే...

పోరుమామిళ్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి హత్య కేసులో ముగ్గురు నిందితులకు పదేళ్ల జైలుశిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ కడప నాలుగవ ఏడీజే కోర్టు జడ్జి జి.దీనా బాబు శుక్రవారం తీర్పునిచ్చారు. పోరుమామిళ్ల పీఎస్ పరిధిలోని రామాయపల్లె శ్మశానం వద్ద 2019లో ఓ మతిస్థిమితం లేని యువతిని గొంతు నులిమి హత్య చేశారని పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై అప్పటి సీఐ నిందితులను అరెస్టు చేసి విచారణ ప్రారంభించారు. విచారణలో పోరుమామిళ్ల బెస్తవీధికి చెందిన షేక్ జిలానీబాషా, ముస్లిం కోటవీధికి చెందిన షేక్ మహబూబ్ బాషా, కట్టకిందపల్లెకు చెందిన కారు నాగేంద్ర ప్రసాద్‌లు యువతిని గొంతునులిమి హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో శుక్రవారం ఆ ముగ్గురికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. కేసులో శిక్ష పడేలా అప్పటి సీఐ మోహన్‌రెడ్డి, సరైన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి శిక్షపడేలా కృషి చేసిన పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ఆర్వీ కొండారెడ్డి, కానిస్టేబుల్ వెంకటసుబ్బయ్యలను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

కానిస్టేబుల్ అని నమ్మించి... పెళ్లి చేసుకున్న వ్యక్తిపై ఫిర్యాదు



కానిస్టేబుల్ దుస్తుల్లో భానుప్రకాశ్ (ఫైల్)



పెళ్లి సమయంలో..భానుప్రకాశ్

పోరుమామిళ్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తాను కానిస్టేబుల్ అని నమ్మించి ఓ యువతిని వివాహం చేసుకొని మోసం చేయడంతో ఆ వ్యక్తిపై యువతి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు... సత్యసాయి జిల్లా తనకల్లు మండలం తుమ్మలవారిపల్లె ప్రాంతానికి చెందిన భానుప్రకాశ్ అనే వ్యక్తి తాను కానిస్టేబుల్ అని పోరుమామిళ్ల మండలం కమ్మవారిపల్లెకు సమీపంలో నివశిస్తున్న ఓ యువతిని నమ్మించి 2024 అక్టోబరులో వివాహం చేసుకున్నాడు. వివాహ సమయంలో కట్నం కింద రూ.3లక్షల నగదు, 15 తులాల బంగారు నగలు ఇచ్చినట్లు యువతి బంధువులు తెలిపారు. వివాహం అయిన తరువాత తాను ఏఆర్ కానిస్టేబుల్ అని చెప్పి హైదరాబాదులో సంసారం పెట్టి నమ్మించాడు. 8 నెలలుగా డ్యూటీకి వెళ్లకపోవడంతో అనుమానం వచ్చిన ఆ యువతి నిలదీయగా.. తాను కానిస్టేబుల్ కాదని ఏం చేస్తారో చేసుకోండని బెదిరించాడు. అదనంగా డబ్బులు కావాలని వేధించేవాడు. దీంతో ఆ యువతిని అతని నుంచి తప్పించుకుని కమ్మవారిపల్లె సమీపంలో ఉన్న తన స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులకు జరిగిన విషయాన్ని తెలిపింది. దీంతో వారు శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ కొండారెడ్డిని వివరణ కోరగా, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలి

కడప కలెక్టరేట్, జూలై4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు సంబంధించిన గోడపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, భారత ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకాన్ని రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. తుఫాన్లు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం, వాతావరణ అంశాల ఆధారంగా సంభవించే పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లించడం పంటల బీమా పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఎంపిక చేసిన పంటల సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ బీమా పథకానికి అర్హులన్నారు. బీమా చేసిన మొత్తానికి 2 శాతం వాణిజ్య, ఉద్యాన పంటలకు 5శాతం, వాస్తవంగా నోటిఫై చేసిన ప్రీమియం శాతం ఇంకా తగ్గిన సందర్భంలో ఆ మొత్తాన్ని చెల్లిస్తే సరిపోతుందన్నారు. వాస్తవ ప్రీమియంలో రైతు చెల్లించగా మొత్తాన్ని బీమా కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయన్నారు. వాతావరణ ఆధారిత



పంటల బీమా గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

పంటల విషయంలో వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి వేగం ఆర్ద్రత వంటి వాతావరణ అంశాల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేసి ఆయా మండలాల పరిధిలో బీమా లెక్కించి చెల్లించడం జరుగుతుందన్నారు. ఎలాంటి దళారులు మధ్యవర్తులను నమ్మి పోవదన్నారు. పంట వేసిన ధ్రువ పత్రం జారీ నిమిత్తం కూడా ఎటువంటి మొత్తాన్ని రైతు సేవా కేంద్రంలో చెల్లించాల్సిన అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు చంద్ర నాయక్, రవి చంద్రబాబు, ఎల్డీఎం జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లల్లో ముమ్మరంగా తనిఖీలు



కడప రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టిన మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ

కడప క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా ఈగల్‌టీం ఐజీ ఆకే రవిక్రిష్ణ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఎస్పీ ఆదేశాలతో రైళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఎర్రగుంట్ల-కడప మార్గంలో ముంబై నుంచి చెన్నై ఎగ్మోర్ వెళుతున్న రైల్లో కడప మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామి రెడ్డి ఆధ్వర్యంలో ఈగల్, రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్పెషల్ పార్టీ, పోలీసు, డాగ్‌స్కాడ్ బృందాలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలన కోసం ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నెం.1972 ఏర్పాటు చేశారని, ఈ నెంబరుకు సమాచారం ఇస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో కడప వన్‌టౌన్ ఎస్ఐ అమర్ నాథరెడ్డి, కడప రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, స్పెషల్‌పార్టీ ఈగల్‌టీం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజాన్ని నిర్మిద్దాం..

- పీ-4 పథకం అమలుపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని ఆంధ్రప్రదేశ్ సచివాయం నుంచి పీ-4 పథకం అమలుపై మార్గదర్శులు, బంగారు కుటుంబాలు అనే అంశంపై జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సమీక్షలో కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అతిదిసింగ్ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర సచివా లయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ సరైన సమయంలో సాయం నిరంతర మార్గనిర్దేశనం అన్నారు. పేదరి కంపై యుద్ధం చేసి చరిత్ర సృష్టించాలన్నారు. బంగారు కుటుంబాలకు సంక్షేమ పథకాల్లో ఎలాంటి కోత ఉండదని సీఎం స్పష్టం చేశారు. పీ-4 అమలులో బాపట్ల జిల్లా టాప్‌లో ఉందన్నారు. పేదరికం లేని సమా జాన్ని స్థాపించడమే పీ-4 పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రాష్ట్రంలో 2029 నాటికి పేదరికాన్ని రూపుమాపాలనే లక్ష్యంతో కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు పని చేయాలన్నారు. పీ-4 విధానంలో పేదలకు సాయం చేస్తూనే ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆర్థికంగా స్థిరపడిన 10 శాతం మందితో అట్టడుగు పేద రికంలో ఉన్న 20 శాతం మందితో అనుసంధానం చేసే విధానమే పీ-4 పథకమన్నారు. పేదరికం లేని సమాజానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలు తదితరాలపై ముఖ్యమంత్రి కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, అగ్రికల్చర్ జేడీ చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

- ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన



డాక్టర్‌తో మాట్లాడుతున్న మృతుడి బంధువులు

పులివెందుల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని గోటూరు సమీపంలో జరిగిన ద్విచక్రవాహనం ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే.... తొండూరు మండలం సైదాపురానికి చెందిన లక్ష్మినారాయణరెడ్డి (53) గంగరాజు మోటర్‌బైకులో వస్తుండగా ఉన్నట్లుండి రోడ్డుపైకి గేదె వచ్చింది. దీన్ని తప్పించబోయి అదుపుతప్పి మోటర్ బైకు కిందపడింది. ఈ ప్రమాదంలో లక్ష్మినారాయణరెడ్డి తలకు గాయాలయ్యాయి. గంగరాజుకు స్వల్ప గాయాలు కావడంతో వీరిని పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లక్ష్మినారాయణరెడ్డికి తలకు గాయం కావడంతో చికిత్స కోసం ఆసుపత్రిలో జాయిన్ చేసుకున్నారు. చికిత్స పొందుతుండగా అర్ధరాత్రి లక్ష్మినారాయణరెడ్డి మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యం చేయడం చేతకాకపోతే మరో ఆసుపత్రికి తీసుకెళ్లేవారమని మృతుడి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపుచేశారు. డాక్టర్ కుటుంబ సభ్యులతో మంతనాలు జరపడంతో సమస్య సద్దుమణిగింది. దీనిపై తొండూరు ఎస్ఐ ఘనమద్దిలేటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధం

లింగాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామసముద్రం గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన గంగాధర్ అనే వ్యక్తికి సంబంధించిన గడ్డివామి పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.30వేలు నష్టం వాటిల్లింది. ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

వెనుకంజలో చిత్తూరు, అనంతపురం జట్లు



మన్విత్‌రెడ్డి, (నెల్లూరు), ఎస్ఎస్ హుస్సేన్ (నెల్లూరు), వీరారెడ్డి (అనంతపురం)

కడప స్పోర్ట్స్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ మల్టీడే (మూడు రోజుల) క్రికెట్ పోటీలలో భాగంగా శుక్రవారం వేర్వేరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు నెల్లూరు జట్టు కంటే 324 పరుగుల వెనుకంజలో నిలిచింది. అదే తరహాలో కర్నూలు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు 74 పరుగుల తేడాతో వెనుకబడి వుంది.

ఏసీఏ మైదానంలో..: నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని 77.3 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో మన్విత్ రెడ్డి 140 పరుగులు చేయగా ఎస్ఎస్ హుస్సేన్ 63 పరుగులు చేశా రు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 14 పరు గులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు మరో 324 పరుగుల వెను కంజలో ఎదురీదుతోంది.

కేఓఆర్ఎం మైదానంలో..: కర్నూలు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్‌నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్‌కు దిగి 59.3 ఓవర్లలో 9 వికెట్ల కోల్పోయి 213 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో విష్ణువర్ధన్‌నాయుడు 68 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 139 పరుగులు చేసింది. ఇందులో వీరారెడ్డి 62 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో అనంతపురం జట్టు మరో 74 పరుగుల వెనుకంజలో వుంది.

స్వర్ణ కడప సాధనకు కృషి : ఎమ్మెల్యే మాధవి



కడప ఎర్రముక్కపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చిన స్వర్ణాంధ్ర -2047లో భాగంగా అందరి సహకారంతో స్వర్ణ కడప సాధనకు కృషి చేస్తానని కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి తెలిపారు. కడప నియోజకవర్గం అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం కడపనగరం తన కార్యాలయంలోఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక తయారు చేశారని, అందులో భాగంగా జిల్లాస్థాయిలో ఏర్పాటయ్యే కమిటీ చైర్మన్‌గా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలను నియమించి వారికి స్పెషలాఫీసర్ సిబ్బందితో పాటు ఇద్దరు సమాజ సేవకులను సభ్యులుగా చేర్చుకోవడం జరిగిందన్నారు. స్వర్ణాంధ్ర కడప-2047లో భాగంగా స్థానికంగా ఎలాంటి సమస్యలు ఉన్నాయి? ఆర్థిక ఆదాయం, పరిశ్రమల వివరాలు, వ్యవసాయపరంగా ఉన్న ఆదాయం, సేవా రంగంలో నియోజకవర్గ శాతం తదితర అంశాలతో వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. రాబోయే కాలంలో మేధావులు,ఇతర అన్నిరంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నవారితో సమావేశాలునిర్వహించి కడపనుఎలా ముందుకు తీసుకెళ్లాలన్న విషయం చర్చిస్తామన్నారు. స్వర్ణ కడపసాధనకు కృషి జరుగుతుందని ఆమె వివరించారు.

తప్పు చేస్తే ఎంతటివారైనా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి

కమలాపురం రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తప్పు చేస్తే ఎంతటి వారిపైనైనా చర్యలుతీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తానరసింహారెడ్డి, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం మాచిరెడ్డిపల్లె గ్రామంలో కమలాపురం నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా అధికారులతో సమావేశం నిర్వహించారు. సమా వేశంలో ఆర్డీవో జాన్ ఎర్విన్ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి ధ్యేయంగా అన్ని శాఖలు కలిసి పనిచేయాలన్నారు. తప్పులు చేస్తే ఎంతటివారి పైనైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక రైతులు తమ పంటలు నష్టపోతున్నామని చెబుతున్నా పట్టించుకోని హార్టికల్చర్ అధికారులు సకాలం లో స్పందించి రైతులకు పనిచేయాలన్నారు. రైతులు కూరగాయలు, పండ్ల తోటల్లో చీడపురుగు పట్టిందని హార్టికల్చర్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని పుత్తా తెలిపారు. ఆక్రమణలకు గురైన డీకేటీ కొండపోరంబోకు భూములను కాపాడి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

విజన్-2047 కల సాకారం చేసుకుందాం : బీటెక్ రవి

పులివెందుల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన పి-4 విజన్-2047 కల సాకారం అయ్యేందుకు సమష్టిగా కృషిచేద్దామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్‌రవి)పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సభాభవనంలో పులివెందుల నియోజకవర్గ స్పెషలాఫీసర్, డ్వామా పీడీ రాజ్యలక్ష్మి అధ్యక్షతన పీ4పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీటెక్ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఈ ప్రాంత వనరులను ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. పేద ప్రజల అభివృద్ధి కోసం ఎన్‌ఆర్‌ఐలను కూడా ఇందులో భాగస్వామ్యం చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషలాఫీసర్ రాజ్యలక్ష్మి, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, మండలస్థాయి అధికారులు,హెచ్‌ఎల్‌సీ చైర్మన్ జోగిరెడ్డి, హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మహబూబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త కష్టపడితే నియోజకవర్గానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు

అబ్జర్వర్ మనోహర్‌నాయుడు



మాట్లాడుతున్న అబ్జర్వర్ మనోహర్‌నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేస్తే కమలాపురం నియోజకవర్గం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలుస్తుందని నియోజకవర్గ అబ్జర్వర్ మనోహర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నారాలోకేశ్ ఐటీడీపీ ద్వారా కొత్త యాప్ తీసుకువచ్చారన్నారు. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి, అందులో ఉన్న లింకు ద్వారా ఇంటింటి సర్వేలో ప్రజల అభిప్రాయాలు సేకరించాలన్నారు. అనంతరంటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు పడిన కష్టానికి కమలాపురం నియోజకవర్గానికి మరింత గౌరవం తెచ్చి పెట్టిందన్నారు. ఇందుకునిదర్శనమే సాగునీటి ప్రాజెక్టుల కోసం వెయ్యి కోట్ల రూపాయలు ఈ సంవత్సరం ఇస్తామని సీఎం చంద్రబాబునాయుడు చెప్పడం నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు పెద్దదర్గాలో గంధం మహోత్సవం

కడప కల్చరల్, జూలై4 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత పెద్దదర్గాలో హజరత్ ఖ్వాజా సయ్యద్ షా పీరుల్లా మొహమ్మద్ మొహ మ్మదుల్ హుస్సేని చిష్టిఉల్ ఖాదరి ఉరు సు మహోత్సవం ఈనెల 6వ తేదీ ఆది వారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అంగరంగ వైభవంగా జరుగనుంది. ప్రజలు తప్పకుండా పాల్గొ ని స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని అమీన్‌పీర్ దర్గా ప్రతినిధులు వెల్లడించారు.

పేదలపాలిట అక్షయపాత్రలు అన్నాక్యాంటీన్లు

కూటమి ప్రభుత్వంతో ఆకలి తీర్చుకుంటున్న అభాగ్యులు ● రూ.5కే కడుపునిండా భోజనం

కడప నాగరాజుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆకలి తీర్చాలని సదుద్దేశంతో చంద్రబాబు మొదటిసారి అన్నపూర్ణ పథకం ద్వారా అక్షయపాత్రగా అన్నాక్యాంటీన్లను ప్రారంభించారు. అన్న క్యాంటీన్ల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిరోజు లక్షల మంది ఐదు రూపాయలకే తమ ఆకలి తీర్చుకునేవారు. ఈ పథక ఉద్దేశం నిరుపేదలైన అనాథలు, అభాగ్యులు ఆకలితో అలమటించరాదని చంద్రబాబు బలమైన నిర్ణయం తీసుకున్నారు కానీ 2019లో ప్రభుత్వం మారి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దుచేసింది. తద్వారా ఎంతోమంది అనాథలు, అభాగ్యులు, నిరుపేద కుటుంబాలు ఆకలితో అలమటించ సాగాయి. మళ్లీ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగస్టు 15న అన్నాక్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పునఃప్రారంభించారు. ప్రతిరోజు ఒక్కో క్యాంటీన్ నుంచి దాదాపు 300 వరకు ప్రజలు ఆకలి తీర్చుకుంటున్నారు. అన్నక్యాంటీన్లు ఉదయం 7గంటల నుంచి టిఫిన్‌తో



అన్నాక్యాంటీన్‌లో భోజనం తింటున్న ప్రజలు

ప్రారంభమై మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం 9.30 వరకు భోజనం సిబ్బంది ఏర్పాటు చేశారు. తద్వారా ప్రతిరోజు కొన్ని లక్షల మంది తమ ఆకలిని తీర్చుకోగలుగుతున్నారు. సన్నబియ్యంతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించడం ఎంతో సంతోషంగా ఉందని ప్రజలు సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, అంగవైకల్యం కలిగిన వారికి ప్రభుత్వం అన్నక్యాంటీన్ల ద్వారా ఆహారం అందిస్తోంది.

రుచికరమైన భోజనం



రూ.5కే భోజనం అంటే అది కూడా అలానే ఉంటుందని కొంద రు అంటుంటారు. సన్నబియ్యం తో, రుచికరమైన కూరలతో సంతృప్తిగా తింటున్నాం. కానీ మా లాంటి పేద ప్రజల ఆకలి తీర్చడం కోసం ఏర్పాటైన అన్నక్యాంటీన్లు మాకు గుడితో సమానం.

వెంకటసుబ్బయ్య, కడప.

దేవుడిచ్చిన వరం



అన్నాక్యాంటీన్లు మాకు దేవుడిచ్చిన వరం. తక్కువ డబ్బు తో రుచికరమైన భోజనం తింటున్నాం. చంద్ర బాబు నాయుడుకు పేదల పాలిట పెన్నిధి అనేందుకు ఇది ఒక ఉదాహరణ.

వెంకటరమణయ్య, కడప.

సుపరిపాలనతోనే సువర్ణపాలన

వల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తాం, సు పరిపాలనతోనే సువర్ణపాలన వస్తుందని ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తప్పెట్ల గ్రామ పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో కలిసి తప్పెట్ల గ్రామంలో ఇంటింటికీ తిరిగి సమస్యలు, సంక్షేమ పథకాలు పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్వాక్రామహిళల ఆరు గ్రూపులకు రూ.14.57లక్షల చెక్కులను అందించారు. అనంతరం ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించి వారిని అక్కడ అధికారులతో సమన్వయపరుస్తూ వాటి పరిష్కార దిశగా చేశారు.నియోజక వర్గపరిశీలకుడు మనోహర్‌నాయుడు, బీజేపీ నాయ కులు కిశోర్, జనసేన ఇన్‌ఛార్జ్ వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీవో రఘురాం, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, గడికోట సుధాకర్ రెడ్డి, సదాశివారెడ్డి, శివారెడ్డి, మధు, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, మార్కెట్ యార్డు





మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, వృద్ధురాలి సమస్య వింటున్న బీటెక్ రవి

డైరెక్టరు వెంకట సుబ్బయ్య, ఓబులరెడ్డి, డాక్టర్ ఇంది రెడ్డి శివారెడ్డి, ఉదయశివారెడ్డి,అలాగే సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

పులివెందుల రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి వాటి పరిష్కారం చూపేందుకే తొలిఅడుగు ఇంటింటికి కార్యక్రమాన్ని చేపట్టామని నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో మున్సిపాలిటీలోని అహోబిలాపురంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీటెక్ రవి ఇంటింటికి వెళ్లి వారి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు అక్కడికక్కడే అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకుడు తూగుట్ల సిద్దారెడ్డి, తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిపాల్గొన్నారు.

ప్రమాదబాధితుడికి రూ.90వేలు ఆర్థికసాయం

వేంపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లె సమీపంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దుగ్గన్నగారిపల్లెకు చెందిన శివానందరెడ్డి కుటుంబానికి ఉపాధ్యాయులు రూ.90వేలు ఆర్థికసహాయం అందించి అండగా నిలిచారు. ప్రమాదానికి గురై ఆసుపత్రి పాలైన ఆ బాధితుడికి అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. గతంలో నారాయణ హైస్కూల్‌లో పీఈటీగా పనిచేసిన శివానందరెడ్డికి సహచర ఉపాధ్యాయులు రూ.30వేలు, నారాయణ హైస్కూల్ కరస్పాండెంట్ రూ.50వేలు, మరో ఉపాధ్యాయురాలు గురుసుబ్బమ్మ రూ.10వేలు, మొత్తం రూ.90వేలు శివానందరెడ్డి తల్లి రమణమ్మకు అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

టీడీపీతోనే ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి

వేముల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పుల గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగాఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో అమలు చేసిన పథకాలను, అభివృద్ధిని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేర్ల శేషారెడ్డి, రాగిపిండి సుధాకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగులపై ఒత్తిడి చేసే పద్ధతికి స్వస్తిపలకాలి

కడప మారుతీనగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జోనల్ వర్క్‌షాపులో పనిచేసే ఉద్యోగులపట్ల పని ఒత్తిడి చేసే పద్ధతికి సంబంధిత అధికారులు స్వస్తి పలకాలని ఆర్టీసీ ఎంప్లాయిస్‌యూనియన్ రీజనల్ కార్యదర్శి అంకిరెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఈయూ రీజనల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ వర్క్‌షాపు ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షుడు రామాంజనేయులు, జోనల్ ఉపాధ్యక్షులు మోహన్‌రావు, బి.వి. నారాయణ, రవినాయక్, సుబ్బారెడ్డి,కేపీపీ సుబ్బారెడ్డి, టైర్‌షాపు కార్యదర్శి వి.వి.సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.


పర్మిషన్ వచ్చేంత వరకు పోరాటం ఆగదు

కడప ఎడ్యుకేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్కిటెక్ విద్యార్థులకు సీఓఏ అనుమతి వచ్చేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు,వైసీపీ నగర అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య తెలిపారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్, వైసీపీ ఆధ్వర్యంలో హంగర్ స్ట్రైక్ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020, 21, 22 విద్యా సంవత్సరానికి సంబంధించిన సీఓఏ కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ పర్మిషన్ ఇవ్వాల్సి ఉందన్నారు.పది రోజుల్లో విద్యా సంవత్సరం పూర్తి అవుతున్న ఇంకా పర్మిషన్ లేకపోవడంపై విద్యార్థులు ఆందోళనతో అడుగుతుంటే యూనివర్సిటీ అధికారులు ఉన్నతాధికారులు అదిగో ఇదిగో అంటూ మోసం చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగదు చోరీ

వేంపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పులివెందుల రోడ్డులో నిలిపి ఉన్న స్కూటీ డిక్కీలోని నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్థానిక మైనారిటీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న భాస్కర్‌రావు శుక్రవారం స్టేట్‌బ్యాంక్‌లో రూ.10వేలు నగదు డ్రా చేసుకొని స్కూటీ డిక్కీలో ఉంచారు. సరుకుల కోసం పులివెందుల రోడ్డులోని సూపర్ మార్కెట్‌కు వెళ్లి వచ్చి డిక్కీలో చూడగా నగదు కనిపించలేదు. నగదుతో పాటు, చెక్కుబుక్కులు, పాఠశాలకు సంబంధించిన పేపర్లు కనిపించలేదని బాధితుడు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదుచేశారు.

తహసీల్దార్‌గా రెడ్డిలక్ష్మి



వేముల, జూలై 4 (ఆంధ్ర జ్యోతి): వేముల మండల నూతన తహసీల్దార్‌గా టి. రెడ్డిలక్ష్మి శుక్ర వారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్ పనిచేస్తున్న ఇందిరా రాణి రిటైర్డ్ కావడంతో రెడ్డిలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈమె పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతిపై వేములకు వచ్చారు.

భావితరాలకు మార్గదర్శి వంగవీటి



వంగవీటిరంగాకు నివాళి అర్పిస్తున్న తుంగా రమణయ్య

కడప సెవెన్ రోడ్స్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు మార్గదర్శి వంగవీటి మోహనరంగ అని జనసేన నాయకుడు తుంగా రమణయ్య అన్నారు. కడపలోని కార్యాలయంలో వంగవీటి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రంగాను తమ తిరుగులేని నాయకుడిగా పరిగణించారన్నారు. అటువంటి మహానాయకుడిని అయ్యప్పమాల వేసుకొని వచ్చిన దుండగులునిరాహార దీక్షలో ఉన్నరంగాను హత్య చేశారన్నారు.

ఎల్ఐసీ పింఛనర్ల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్ రోడ్స్ జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ పింఛనర్ల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పింఛనర్స్ అసోసియేషన్, కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.సుధీకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నాలో ఆయన మాట్లాడారు. ధర్నాకు సంఘీభావంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ ధర్నాలో అసోసియేషన్ నాయకులు శంకర్‌రావు, టి. చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, అమర్‌నాథ్‌బాబు పాల్గొన్నారు.

'అక్రమాలపై విచారణ జరపాలి'

కడప ఎడ్యుకేషన్,జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలుపాటించని ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కడప ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ విచారణజరిపి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం ఓంశాంతి నగర్ ఏఐఎస్‌బీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకపోయినప్పటికీ విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఏఐఎస్‌బీ నాయకులు మనోజ్, సుహేష్ పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలే లక్ష్యంగా సీపీఐ మహాసభలు

కడప సెవెన్‌రోడ్స్ జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలే లక్ష్యంగా సీపీఐ మహాసభలు నిర్వహించబోతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 22 నుంచి 24 వరకు బద్వేల్‌లో జిల్లా మహాసభలు, ఆగస్టు 20 నుంచి 25 వరకు ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబరు 21 నుంచి 24 వరకు చండీఘర్‌లో జాతీయ మహాసభలు జరగబోతున్నాయని తెలిపారు.

చౌడుభూమిగా మారితే దిగుబడి తగ్గుతుంది



మినుము పంటను పరిశీలిస్తున్న దృశ్యం

కమలాపురం రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సాగుభూమి చౌడు బారడం వల్ల భూమిలోని పోషకాలు మొక్కకు సరైన స్థాయిలో అందక దిగుబడి తగ్గిపోతుందని ఏడీఏ నరసింహారెడ్డి అన్నారు. శుక్ర వారం మండల పరిధిలోని దేవరాజుపల్లె గ్రామ పొలాల్లో సాగు చేసిన మినుము పంటను కేవీకే కో-ఆర్డినేటరు,ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ వీరయ్య, ఏవో ఎం.సరస్వతితో కలిసి మినుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు భూమి చౌడు బారడం వల్ల భూమిలోని పోషకాలు మొక్కకు సరైన స్థాయిలో అందక ఎండిపోతున్నాయని తెలిపారు. దీనికి గాను పూత దశకు ముందు 19-19-19 పదిరోజుల వ్యవధిలో రెండుసార్లు 5 గ్రాములు లీటరు చొప్పున పిచికారీ చేసుకోవాలఅన్నారు. అలాగే పూత దశలో 13.0.45 లేదా మల్టీకే 10గ్రాములు ఒక లీటరు చొప్పున పైపాటుగా పిచికారి చేసుకోవాలని తెలిపారు. అలాగే మినుము పంటలో వైరస్ నివారణకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చౌక ధర దుకాణం సీజ్

చెన్నూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని 8వ చౌక ధర దుకాణంలో 103 కిలోలు చౌక బియ్యం ఎక్కువగా ఉండడంతో ఆ దుకాణాన్ని ఎన్‌ఫోర్స్ మెంటు డీటీ మనోజ్ శుక్రవారం సీజ్ చేశారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీ ఆ చౌక దుకాణం తనిఖీల్లో భాగంగా చెన్నూరు 8వ చౌకధర దుకాణం కూడా తనిఖీ చేశారు. అప్పటికే అక్కడ ఉండవలసిన బియ్యం కన్నా 103 కిలోలు అదనంగా ఉండడం జరిగింది. దీంతో కొత్త రికార్డులు పరిశీలించిన డీటీ ఆ చౌక దుకాణాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

26 బస్తాల చౌక బియ్యం స్వాధీనం

చెన్నూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోపవరం సమీప వ్యవసాయ పొలాల్లో చెట్ల కింద అక్రమంగా తరలించేందుకు నిల్వఉన్న 26 చౌక బియ్యం బస్తాలను సీఐ క్రిష్ణా రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టుకున్నారు. పక్కాగా అందిన సమాచారం మేరకు దాడులు చేయడంతో ఈ 26బియ్యం బస్తాలు పట్టుబడ్డాయి. దీంతో షేక్ బీబీ, జావీద్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే పట్టుబడ్డ బియ్యాన్ని తహసీల్దారు ద్వారా పంచనామా చేయించి స్థానిక గోడౌనుకు అప్పగించారు.

6న ఉచితంగా రేబీస్ టీకాలు

కడప రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా జూలై 6న ఉదయం 9 గంటల నుంచి కడప నగరంలోని బహుళార్థ పశువైద్యశాలలో ఉచిత రేబీస్ టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ తెలిపారు. ఈ అవకాశాన్ని పెంపుడు జంతువుల యజమానులు(కుక్కలు, పిల్లులు) సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

సీకేదిన్నె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలను కూల్చివేసినట్లు చింతకొమ్మదిన్నె తహసీల్దారు నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని హోంగార్డు కాలనీ సర్వే నంబరు 845లో నాలుగున్నర సెంటు విస్తీర్ణంలో రస్తాను ఆక్రమించి అక్రమంగా కడుతున్న రేకులషెడ్డు నిర్మాణాన్ని జేసీబీతో తొలగించారు. రోడ్డు ఆక్రమించి రాకపోకలు జరుగకుండా నిర్మిస్తున్న సమాచారం తెలుసుకున్న తహసీల్దారు అక్రమ నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించినవారు ఎవరైనా, ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

కడప కల్చరల్, జూలై4 (ఆంధ్రజ్యోతి): నగర సీఎస్ఐ స్కూల్ ఎదురుగా ఉన్న జగదీష్ న్యూరో కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఈనెల 6వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ క్రాంతిరెడ్డి ఉచిత వైద్యశిబిరం జరుగనుంది. ఇందులో అన్ని రకాల వ్యాధుల వారికి ఉచితంగా పరీక్షించి సూచనలు, సలహాలు, ఇవ్వనున్నారు. కాగా ఇందులో డాక్టర్ సూచించిన ఇతర పరీక్షలను 50 శాతం రాయితీతో చేయడం జరుగుతుంది. ఉచితంగా షుగర్ పరీక్ష, ఉచిత ఓపీ కన్సల్టేషన్, కేవలం 150 రూపాయలకే థైరాయిడ్ పరీక్షలు చేయనున్నారు. కాగా ఈనెల 1 నుంచి అడ్మిషన్ అవసరమైన సీనియర్ సిటిజన్స్ (60 సంవత్సరాలు పైబడిన వారికి) కు సైనికుల కుటుంబాల వారికి, తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి బెడ్ చార్జెస్‌లో 25 శాతం తగ్గించనున్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హాస్పిటల్ నిర్వాహకులు వెల్లడించారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

వేంపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లి వ్యసనంగా మార్చుకుంటే జీవితాలునాశనం అవుతాయని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో శుక్రవారం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో ఏఓ రవి కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు దీప్తి, తిరుపతిరెడ్డి,వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు తొలి ఏకాదశి వేడుకలు



చెన్నూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు ప్రసన్న వేం కటేశ్వరుని ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వ హిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. అతి ప్రాచీనమైన ఈ ఆలయంలో ప్రతి ఏటా తొలి ఏకాదశితో పాటు రథసప్తమి, ముక్కోటి ఏకాదశి, శ్రావణమాసోత్సవాలు, ప్రతి శనివారం ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ మారు తొలి ఏకాదశిని మరింత బాగా నిర్వహించేందకు ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. ఇందులో తెల్లవారుజామున 4గంటలకే సుప్రభాత సేవతో పాటు అభిషేకాలు, గోవిందనామాలు, విష్ణు సహస్ర నామపారాయణం, దర్శనం, సాయంత్రం ఆలయ మాడవీదుల్లో గరుడసేవ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలకు తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు మైదుకూరు మండల సమావేశం

మైదుకూరురూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఉదయం 10.30కి హాజరు కావాలని కోరారు.

ప్రొద్దుటూరు మండలంలో..

ప్రొద్దుటూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి):ప్రొద్దుటూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సాదారణ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభాభవనంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, సంబంధిత వివిధ శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నేడు జాబ్ మేళా

బద్వేలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 5న సీఈఏటీ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల పరిపాలనాధికారి రాచపూడి సాయికృష్ణ తెలిపారు. బీఎస్సీ, బీసీఏ చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొత్తం 150 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనే విద్యార్థులు ఉదయం 9 గంటలలోపు నాగభూషణం కళాశాలకు చేరుకోవాలని తెలిపారు.

6న పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కళాశాలలో 6వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కుక్కలు, పిల్లులు, తదితర జంతువులకు ఉచితంగా రేబిస్‌వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని మండల పరిధిలోని వెంకటేశ్వర పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైదుకూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వనిపెంట గ్రామంలో 11 కేవీ ఫీడర్స్ పరిధిలో విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్నందు న శనివారం ఉదయం 7.40 నుంచి 10.50 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ప్రజలు విద్యుత్ అంతరాయాన్ని గమనించాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పీర్లకు ఫాతెహా

జమ్మలమడుగు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మొహరం పండుగను పురస్కరించుకుని జమ్మలమడుగులోని పలు వీధుల్లో పీర్లు కొలువుదీరాయి. పీర్లచావిడిల వద్ద నిర్వాహకుల ప్రతిరోజు ఫాతెహాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం గూడుమస్తాన్ వలి, మెయిన్ పోస్టాఫీసు ప్రాంతాల్లో కొలువు దీరిన పీర్లకు చదివింపులు చేశా రు.

ముద్దనూరు: మండల కేంద్రంలో పీర్లు ఊరేగించారు. శనివారం సాయంత్రం అబ్దుల్‌ఖాదర్ ఇంటి నుంచి ఊరేగింపుగా వెళ్లి చీదివింపులు చేస్తారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు గుండం కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం పీర్లు ఏటికి వెళతాయి.

పోరుమామిళ్ల : స్థానిక ఉద్దికట్ట వీధి, బలిజ కోట, టేకూరుపేటల్లో శుక్రవారం పీర్లను కొలువుదీర్చారు

సోమేశ్వరులకు మొల్ల సాహితీ అవార్డు

బద్వేలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) నిజామాబాద్‌కు చెందిన సాహితీవేత్త, పాత్రికేయులు సోమేశ్వరులకు శుక్రవారం స్థానిక మొల్ల సాహితీ కార్యాలయంలో శుక్రవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. మొల్ల విగ్రహ సన్నిధిలో గానుగపెంట హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి మనోజ్ ఈ అవార్డును అందజేశారు. వెంకట రాయుడు కుమార్‌ను కూడా ఘనంగా సత్కరిం

'ప్రతి ఇంటికి సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం'

● 30 కుటుంబాలు టీడీపీలో చేరిక



కాశినాయన: వైసీపీ కార్యకర్తలకు కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న విజయమ్మ,రితేష్‌రెడ్డి



ప్రొద్దుటూరు: ప్రచారంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ రాఘవ రెడ్డి ప్రతాప్

కాశినాయన జూలై 4(ఆంధ్రజ్యోతి):ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బద్వేల్ మాజీ ఎమ్మెల్యే టీడీపీ నాయకురాలు కే.విజయమ్మ, బద్వేల్ టీడీపీ సమన్వయకర్త కే.రితేష్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైసీపీకి చెందిన 30 కుటుంబాల వారిని టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, బీజేపీ నాయకుడు బొజ్జా రోశన్న, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బద్వేలుటౌన్ : పట్టణంలోని 10వ వార్డు సుమిత్రా నగర్‌లో రితేశ్ రెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించార్థు. బొజ్జ రోశన్న, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్ కుమార్, శివయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు: వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేసిందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య మాజీ ఎంపీపీ రాఘవ రెడ్డి తెలిపారు. గోపవరం పంచాయతీ ఆచార్ల కాలనీలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జాకీర్, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, బచ్చల ప్రతాప్ నంద్యాల ఆనందభార్గవ రెడ్డి సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి, పొట్టు లక్ష్మీరెడ్డి, ఆవుల రాజేశ్వరరెడ్డి జిసి పుల్లయ్య, డాక్టర్ గౌస్, కాలే తదితరులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, తలారి రమేష్ దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి, యోగివేమన యూనివర్సిటి నాన్‌టీచింగ్ స్టాఫ్ అధ్యక్షుడు రసూల్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు : డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మంచూరి సూర్య నారాయణరెడ్డి కమలకూరు, మన్యంవారిపల్లె గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు అరవ శ్రీనివాసులురెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, అట్లూరుసొసైటీ డైరెక్టరు రాధాక్రిష్ణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల ఆర్థిక ఉన్నతే పీ4 లక్ష్యం

● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్డీవో సాయిశ్రీ, ఇతర అధికారులు

జమ్మలమడుగు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బంగారు కుటుంబాలు ఆర్థికంగా ఉన్నతి సాధించడమే పి4 ఉద్దేశ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో మాట్లాడారు. పేద కుటుంబాలకు ఎన్‌ఆర్‌ఐలు దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తారన్నారు. బంగారు కుటుంబాల మ్యాపింగ్ పూర్తయిందని, పేద కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై వారు ముందుకు వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. . జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఈ ఆర్డీవో సాయిశ్రీ, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, కమిషనర్లు, కమిటీ సభ్యులు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గ అభివృద్ధి

బద్వేలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి):స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా బద్వేలు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ చంద్రమోహన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్ రెడ్డి శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. బద్వేలు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ఆయాశాఖల అధికారులు ప్రణాళికలను రూపొందించి జిల్లాలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికబద్ధంగా అధికారులు కృషి చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్, అన్ని మండలాల ఎంపీడీవోలు , వ్యవసాయ అధికారులు, హార్టికల్చర్ అధికారులు, పశుసంవర్థక, అటవీ, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర,రాష్ట్ర విధానాలపై పోరాటాలు

బద్వేలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిపై ఈ నెల 22 నుంచి 24 వ తేదీ వరకు బద్వేలులో జిల్లా మహాసభలు, ఆగస్టు 20 నుంచి 25 వరకు ఒంగోలులో రాష్ట్ర మహాసభలు , సెప్టెంబర్ 21 నుంచి 24 వరకు చండీఘడ్‌లో జాతీయమహాసభలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వీరశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నాయకులు గాలిచంద్ర, రామయ్య, రామసుబ్బారెడ్డి, చంద్రశేఖర్, జమ్మి సుబ్బారెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యంతో టీబీ నివారణ

బద్వేలు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో గుర్తించి సరైన వైద్యం అందించడం ద్వారా టీబీని నయం చేయవచ్చని తొట్టిగారిపల్లె వైద్యాధికారి జె.వినయ్ కుమార్ తెలిపారు. 104 టీబీ ముక్తభారత్ అభియాన్ జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని తిరువెంగలాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, గళ్లలో రక్తం పడడం, ఛాతీలో నొప్పి, ఆయాసం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్తపరీక్షలు నిర్వహించుకోవాలని, టీబీ నిర్థారణ అయితే, ఉచితంగా మందులతోపాటు, కేంద్రప్రభుత్వం ప్రతి నెలా వెయ్యి రూపాయల నగదు అందజేస్తుందన్నారు. ఇటువంటి లక్షణాలున్న వారు వెంటనే ప్రభుత్వఆసుపత్రికి వచ్చి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజరు నరసింహ ప్రసాద్, ల్యాబ్ సూపర్‌వైజరు బ్రహ్మారెడ్డి, వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంటు జనార్ధనరావు, సీహెచ్‌వో, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కొండాపురంలో పోలీసుల పల్లెనిద్ర

కొండాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్‌నేరాలు, పోక్సో చట్టం, బాల్యవివాహాలు, కొత్తచట్టాలపై యువతకు అవగాహన కల్పించినట్లు ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నాగేంద్ర పాల్గొన్నారన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రులు

జమ్మలమడుగు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథే సోమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రుల పూజలు శుక్రవారం ముగి శాయి. ఈ సందర్భంగా భక్తులు మహాగణపతి, వారాహి హోమాలు నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు.

చెత్త సేకరణపై డీపీవో అసంతృప్తి

ప్రొద్దుటూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీలో ఇంటింటి చెత్త సేకరణతీరుపై డీపీవో రాజ్యలక్ష్మి అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్తపల్లి పంచాయతీలోని కే4 సచివాలయం పరిధిలో ఉన్న అమృతానగర్‌లో పర్యటించారు. పూడిపోయిన కాలువలు, రోడ్లపై పేరుకుపోయిన చెత్త, అపరిశుభ్రతను గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజు కచ్చితంగా ప్రతి ఇంటి నుంచి కసువు సేకరణ జరగాలని ఆదేశించారు. పంచాయతీ కార్యాలయంలో స్థానిక అధికారులతో మాట్లాడుతూ మందకొడిగా పన్ను వసూళ్లపై అసహనం వ్యక్తం చేశారు. డీడీవోలు కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి పన్ను వసూళ్లకు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తపల్లె పంచాయతీ కార్యాలయ ఆవరణంలో పేరుకుపోయిన చెత్త తొలగింపుకు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ సహకారం తీసుకోవాలన్నారు. మండల పరిధిలోని 10 వేలు అడుగుల చదరపు అడుగులు దాటిన ప్రైవేటు, ప్రభుత్వ గోదాములు, భవనాలకు రీ అసెస్‌మెంట్ నిర్వహించారు. తాజాగా కొలతలు వేసి పన్ను వసూళ్లకు ఆదేశాలు జారీ చేశారు.

అనుమతులు లేని నిర్మాణాలకు నోటీసులు

బద్వేలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పరిధిలోని చెన్నంపల్లె గ్రామ సర్వే నెంబర్.1768లో ఫణీంద్రరెడ్డి, లక్ష్మీదేవి 4 సెంట్ల విస్తీర్ణంలో అనధికారికంగా భవనాన్ని నిర్మించుకున్నారు. ఈవిషయమై శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సదరు భవన నిర్మాణ యజమానులకు నోటీసులు ఇచ్చారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించడంతో భవనాన్ని సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడితేకఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వంగవీటి మోహనరంగాకు నివాళి

పోరుమామిళ్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాయల సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం వంగవీటి మోహనరంగాకు ఆయన జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రచయిత బొల్లుంరామ్మోహన్ మాట్లాడుతూ . సమాజానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆ సమితి అధ్యక్షులు రుద్రవరం వెంకటేశ్వర్లు, బాలచంద్ర, వీరభద్ర, గురుప్రసాద్, నాని పాల్గొన్నారు.

మడూరు ఛానల్లో వ్యర్థాల తొలగింపు

ప్రొద్దుటూరు ,జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మడూరు కాలువలో సిల్టును శుక్రవారం తొలగించారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా తెలిపారు.

లోకేశ్‌ను కలిసిన వేణుగోపాల్ రెడ్డి

బి.కోడూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఉండవల్లిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మంత్రి లోకేశ్‌బాబును కలిసి మండలంలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం ఇచ్చినట్లు బి.కోడూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఇండ్ల వేణుగోపాల్‌రెడ్డి (బాబు) శుక్రవారం తెలిపారు. మాజీ డీలరు కూరాకు రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

పోరుమామిళ్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సమస్యను పరిష్కరిస్తామని రంగ సముద్రం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ రెడ్డి అన్నారు. రంగసముద్రం పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద డ్రైనేజీ పూడిపోవడంతో స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన సర్పంచ్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు.

శాకంబరి అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి



బద్వేలులో ప్రత్యేక అలంకారంలో కన్యకాపరమేశ్వరి

బద్వేలుటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో కనకదుర్గమ్మ అమ్మవారిని ఆషాఢ శుక్రవారం సందర్భంగా మెహెందీ కోన్లతో ప్రత్యేకంగా అలంక రించారు. ఆర్డీఓ చంద్రమోహన్ దర్శించుకున్నారు. వారితో పాటు కమిటీ సభ్యులు ప్రదీప్‌శర్మ, నాగభూషణం, పబ్బతి చంద్రశేఖర్, దర్శి సుబ్బరాజ, రవి, అశోక్‌కుమార్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, తదితరులు పూజలు నిర్వహించారు.

బ్రహ్మంగారిమఠం: వారాహీ నవరాత్రోత్సవాల్లో భాగంగా స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిశాల అధ్యక్షుడు బన్నూరు కృష్ణమూర్తి, పబ్బతి రాజేశ్వర్‌రావు, సుంకు నాగేశ్వర్‌రావు, బుచ్చర్ల శేషయ్య, మునగా వెంకటేశ్వర్లు, సుంకు సురేశ్, దర్శి వెంకట చలమయ్య, దర్శి రుక్మిణీదేవితో పాటు కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు, ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : ఏరువాకగంగమ్మ అమ్మవారికి శుక్రవారం శాకంబరీ అలంకారం చేశారు. వంకాయలు, క్యారెట్, దొండకాయలు, మునక్కాయలు, ఆలు, నిమ్మకాయలు, కందగడ్డ, బెండకాయలు, పచ్చిమిర్చి, సీనికాయలు, క్యాబేజి, టమోట, కాకరకాయలు, ముల్లంగి తదితర కూరగాయలు అలంకరణకు ఉపయోగించారు. చిన్నమ్మవారుగా పిలిచే ఉత్సవ విగ్రహాన్ని కూడా కూరగాయలతో అలంకరించారు. పూజల అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు.

● శుక్రవారం ఉదయం మహా అంకమ్మ ఆలయంలో నిర్వహించిన కుంకుమార్చన, అభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సతీమణి అరుణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సభ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న బుశెట్టి రామమోహన్‌రావు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సభ నూతన కార్యవర్గం శుక్రవారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేసింది. ఆర్యవైశ్య సభ లీగల్ అడ్వైజర్ కొప్పర్తి మధుసూదన్ వారితో ప్రమాణ ం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు మాట్లాడుతూ ఈ ఏడాది దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. . పేద ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని, ఆర్యవైశ్య సభ ద్వారా స్థలాలు పొందిన వారికి దాతల సహకారంతో ఇండ్లను నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. తనను వరుసగా ఎనిమిదిసార్లు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఆర్యవైశ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడిగా బుశెట్టి రామమోహన్‌రావు, ఉపాధ్యక్షుడిగా జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శిగా మురికి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా మల్లెంకొండు ప్రతాప్, గౌరవ సభ్యుడుగా వంకధార వీరభద్రయ్య, జొన్నలగడ్డ రామచంద్రప్రసాద్, పోలేపల్లి రాజాబాబు, రేగంటి సురేష్‌బాబు, మురికి మల్లికార్జున, 24 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, వాల్మీకి, బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి ఆర్యవైశ్య ప్రముఖులు, పట్టణ ప్రముఖులు ఘనంగా సత్కరించి అభినందించారు.

సమ్మెను జయప్రదం చేయండి

కొండాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9న దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం కొండాపురంలో కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల నాయకులు మనోహర్‌బాబు,వెంకటరమణ, పద్మావతి, జ్యోతి, తులసి,జయమ్మ,రాధ తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ అమలు చేయాలి

పోరుమామిళ్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : 12వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం యూటీఎఫ్ సభ్యత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు పోరుమామిళ్ల యూటీఎఫ్ నేతలు ఎన్.శ్రీనివాసులు, ఈశ్వర్‌రావు, కె.ప్రసాద్, కె.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సన్మానం

కొండాపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళుతున్న మండలంలోని రైతుసేవా కేంద్రాల సిబ్బంది శివ నారాయణ, అంజనమ్మ ,కన్నా, సురేష్‌బాబు, కరీమున్‌ను ఏడీఏ వెంకట సుబ్బయ్య, ఏవో రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కొండాపురం రైతుసేవా కేంద్రంలో సన్మానించారు. వారి సేవలను ప్రశంసించారు. బదిలీ అయిన కేంద్రాల్లో సైతం ఉత్తమ సేవలందించాలని ఆకాంక్షించారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమాపై అవగాహన

ముద్దనూరు జూలై4(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు ప్రధాన మంత్రి ఫసల్ బీమాపై శుక్రవారం వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. స్థానిక వ్యవసాయ కేంద్రంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి తగు సూచనలు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటకు ఇన్సూరెన్స్‌కు అనుమతి పొందిన పంటకు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. పంట బీమా పథకాన్ని రెండు కేటగిరీలుగా విభజించారని రైతులు గుర్తించాలన్నారు. దిగుబడి ఆధారిత (పంటకోత)పంట బీమా పథకం కింద వరి, జొన్న మొక్క జొన్న, కంది, ఎండు మిరప, మినుము, పసుపు, ఉల్లి, వాతావరణ ఆధారిత పంట బీమా పథకం కింద వేరుశనగ, టమోటా, అరటి, పత్తి, నిమ్మ, బత్తాయి పంటలు ఉన్నాయన్నారు. అనంతరం బీమా సంబంధిత పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మూలపల్లె పాఠశాలలో అతిథి భోజనం ఏర్పాటు

కాశినాయన, జూలై 4 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మూల పల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠ శాలలో శుక్రవారం అతిథి భోజ నం ఏర్పాటు చేసినట్లు ప్రధానో పాధ్యాయుడు చంద్రశేఖర్ తెలి పారు. పాఠశాలలో 4వ తరగతి చదవుతున్న ఎర్రబల్లె ఓబులేష్ తండ్రి ఎర్రబల్లె ఓబయ్య పుట్టి నరోజు సందర్భంగా పాఠశాల లోని 30 మంది విద్యార్థులకు మాంసాహార భోజనం ఏర్పాటు చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి గొంటువారిపల్లెకు చెందిన కొవ్వూ రు గురుప్రసాద్ (హార్టికల్చర్ ఉద్యోగి) విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు, హిందీ ప్రింటెడ్ కాపీ రైటింగ్ పుస్తకాలను అందజేశారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

కాశినాయన, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అం దించాలని ఎంఈవో ని ర్మల సూచించారు. శుక్రవారం మండలంలోని నర్సాపురం ప్రైమరీ మోడ ల్ పాఠశాలను ఆమె సందర్శించారు విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు.. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట ఏజెన్సీ వారికి పలు సూచనలు చేశారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

జమ్మలమడుగు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిరిడీ జ్ఞాన సాయిబాబా మందిరంలో ఈ నెల 10న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీవారు తెలిపారు. ఈ సందర్భం గా అన్నదానం చేసేందుకు విరాళాలు సేకరిస్తున్నట్లు కమిటీ నాయకులు శివారెడ్డి, భక్తులు తెలిపారు. 10వ తేదీ ఉదయం 5 గంటల నుం చి పూజలు, మధ్యాహ్నం హారతి, అన్నప్రసాద వినియోగం, సాయంత్రం 6 గంటలకు సంధ్య హారతి, 7 గంటలకు పల్లకీసేవ, 9 గంటలకు సేజ్ హారతి కార్యక్రమాలునిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోరగుడి కోవెలకుంట్ల రోడ్డులోని దత్తసాయిబాబా ఆలయంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు దొంతిరెడ్డి మాధవ నరసింహారెడ్డి తెలిపారు.

డెంగ్యూ వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండండి

దువ్వూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ జ్వరాలు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సురేష్‌బాబు, రోష్ని సూచించారు. దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం డెంగ్యూ మాసోత్సవం పేరిట అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా, ఫైలేరియా, మెదడువాపు జ్వరం, పచ్చజ్వరం లాంటి వాటిపై అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు వహించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, చంద్రమౌళి, విజయకుమారి, శివగంగరాజు, సువర్ణ పాల్గొన్నారు.

రఘునాథరెడ్డికి డాక్టరేట్



రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నంద్యాల రఘునాథరెడ్డికి రాయలసీమ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాయలసీమ వ్యాయామ విద్య కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ ఎస్.గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎ స్టడీ ఆన్ స్పోర్ట్స్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అండ్ స్పెషాలిటీస్ ఇన్ సెలెక్టెడ్ నాన్ ప్రొఫెషనల్ కాలేజెస్ ఆఫ్ యోగివేమన యూనివర్సిటీ అన్న అంశంపై పరిశోధన చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు అభినందించారు.

గవర్నర్‌ను కలిసిన డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి



గవర్నర్ ను కలిసిన హెల్త్‌వర్సిటీ వీసీ, పాలక మండలి సభ్యులు

ప్రొద్దుటూరు ,జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి పాలకమండలి సభ్యులు గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాద పూర్వకంగా కలిసినట్లు పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం విజయవాడలోని గవర్నర్ కార్యాలయానికి వెళ్లి పుష్ప గుచ్ఛం అందజేశామన్నారు. ప్రతిష్ఠాత్మక ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి రాష్ట్ర రాజధాని అమరావతిలో 40 ఎకరాల భూమి కేటాయించాలని, భవనాలు నిర్మించాలని కోరినట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

బద్వేలు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ అధ్యక్షుడు బోసుబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డిపో గేటు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతులు అమలు చేయాలని, ఉద్యోగాలు భర్తీ చేయడంలో ప్రభుత్వాలు విఫల మయ్యాయని, డ్రైవర్లు, కండక్టర్లు, క్లరికల్ విభాగంలో సుమారు పదివేల మంది నియామకాలకు అనుమతి ఇవ్వాలని కోరారు.

'ఫొటోగ్రాఫర్స్' క్రికెట్ పోటీలు

బద్వేలు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బద్వేలు ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీవీఆర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఫొటోగ్రాఫర్స్ క్రికెట్ పోటీలు ప్రారంభించినట్లు గౌరవాధ్యక్షుడు బోలా నారాయణ, అధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు. ఆరు టీంలు ఈ పోటీలో పాల్గొంటున్నాయని శనివారం కూడా పోటీలు ఎ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాబు, సలహాదారులు చలపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.